


**శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు : డిఎస్‌పి**


# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

బుధవారం | 12 జూన్, 2024 | పేజీలు : 04


# నేటి నుండి మోగనున్న బడిగంటలు

### ఒడిచాచిన బడి

### రా రమ్మంటున్న చదువుల గుడి



**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి:** నేటి నుండి బడి గంటలు మోగనున్నాయి. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. బడిబాట కార్యక్రమంతో ఉపాధ్యాయులు సందడి చేస్తున్న నేపద్యంలో చదువుల తల్లి ఒడికి పిల్లలు చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించింది. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో పాఠశాలలను ముస్తాబు చేయగా విద్యార్థులను రా రమ్మంటున్న చదువుల గుడి స్వాగతం పలుకుతుంది. ఈ విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు కూడా అడ్మిషన్ల కోసం పెద్ద ఎత్తున క్యాంపెనింగ్ నిర్వహిస్తున్నారు. వేసవి సెలవుల్లో ఇన్ని రోజులు సేదతీరిన విద్యార్థులు సెలవులు ముగియడంతో నేటి నుండి బాడి బాట పట్టనున్నారు. మూలకు వేసిన స్కూల్ బ్యాగులను సర్దుకునే పనిలో పడ్డారు. అధికారులు చెప్పిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 885 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 53వేలకుపైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీటితో పాటు 248 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో లక్షకుపైగా విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థుల కోసం ప్రభుత్వం ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను పంపిణీ చేసేందుకు సిద్ధం చేసింది. గత విద్యాసంవత్సరం కన్నా ఈ విద్యాసంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను సంఖ్యను పెంచేందుకు గత వారం రోజుల నుండి ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు గ్రామాలు, పట్టణాల్లో తిరుగుతూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరుతున్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పిస్తే కలిగే ప్రయోజనాలను వివరిస్తూ వారిని చైతన్యం చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు గత నెల రోజుల నుండి తమ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు, సిబ్బందితో పెద్ద ఎత్తున ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. రంగు రంగుల బ్రోచర్లను ముద్రించి తమ పాఠశాలల్లో అందించే విద్యను అందులో పొందుపరచి పంపిణీ చేస్తున్నారు. తమ పాఠశాలల్లో చదివిన పూర్వ విద్యార్థులు సాధించిన ర్యాంకులతో ప్రచారాన్ని సాగిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్ అనుగుణంగా ఒక నిర్ణయానికి వచ్చి వారికి నచ్చిన పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పిస్తున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు సిద్ధమవ్వగా వారి తల్లిదండ్రులు పిల్లలకు కావాల్సిన విద్యాసామాగ్రిని సమకూర్చే పనిలో నిమగ్నమయ్యారు.

---

# ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ విద్యాలయాల్లో ఫలితాలు రాబట్టాలి



### ఎమ్మెల్యే బాలునాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ:** ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని దేవరకొండ ఎంఎల్ఎ నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మండల విద్యాధికారులు, కస్తూర్బా, మోడల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో ఎంఎల్ఎ బాలునాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో విద్యుత్, తాగునీటి, టాయిలేట్లు, ప్రహారీగోడల నిర్మాణం తదితర మౌలిక వసతుల కొరకు ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయనున్నట్లు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో వేలాదిగా మూతపడిన ప్రభుత్వ పాఠశాలలకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటిల ద్వారా పూర్వ వైభవం తీసుకురావడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, పాఠశాల పరిసరాలలో తన సొంత నిధుల నుండి సిసి కెమెరాలు ఏర్పాటు చేయిస్తానని ఎంఎల్ఏ బాలునాయక్ హామీ ఇచ్చారు. పాఠశాలలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం ఎంఎల్ఎను సన్మానించారు. ఈకార్యక్రమంలో మండల విద్యాధికారులు, కేజిబివి, మోడల్ స్కూల్‌ల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

---

# విస్తరణ అస్తవ్యస్తం

### సంవత్సరాలు గడిచినా ముందుకు సాగని పనులు

### ఆక్రమణలు తొలగించడంలో అధికారుల నిర్లక్ష్యం






**ప్రజాపక్షం/మోత్కూర్ :** మోత్కూరు మున్సిపాలిటీలో ప్రధాన రహదారి రోడ్డు విస్తరణ పనులు అస్తవ్యస్తంగా జరుగుతున్నాయి. రహదారికి అడ్డుగా ఉన్న నిర్మాణాలు తొలగించకుండానే మురికి కాలువల నిర్మాణం చేపడుతున్నారు. మోత్కూర్ మేజర్ గ్రామపంచాయతీ నుండి మున్సిపాలిటీగా ఏర్పడిన అనంతరం పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం నుండి నిధులు కూడా మంజూరు అయ్యాయి. అభివృద్ధిలో భాగంగా మున్సిపాలిటీ ప్రధానరహదారి 100 ఫీట్ల రోడ్డుకు విస్తరించాలని అధికారులు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌తో కలిసి ప్రణాళికలు సిద్ధం చేశారు. అందుకుగాను గత ప్రభుత్వం విస్తరణ పనుల కోసం రూ.9 కోట్ల నిధులు (రోడ్ + మురికి కాలువలు) మంజూరు చేసింది. మోత్కూరు మున్సిపాలిటీ లో ప్రధాన రహదారి 100 ఫీట్లకు విస్తరించాలని, మార్కింగ్ మార్కింగ్ ఇస్తున్న నేపథ్యంలో ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. నిబంధన ప్రకారం రోడ్డు విస్తరిస్తే ప్రజలు భారీగా నష్టపోతున్నారని, అప్పటి ప్రభుత్వంలో నాయకులు ప్రజల కోరిక మేరకు 100 ఫీట్ల రోడ్డును 80 ఫీట్లకు కుదించి, విస్తరించాలని నిర్ణయించారు. అందులో భాగంగా మూడు కిలోమీటర్ల మేర, పోతాయిగడ్డ రిజిస్ట్రేషన్ కార్యాలయం నుండి కొత్త బస్టాండ్ ఏరియా వరకు ప్రధాన రహదారి విస్తరణ పనులు ప్రారంభించే ముందు రోడ్డు మధ్యభాగం నుండి ఇరువైపులా 40 ఫీట్లకు అధికారులు మార్కింగ్ చేశారు. మార్కింగ్ ప్రకారమే ఆక్రమణలో ఉన్న ఇండ్లను స్వతగాతోలిగించుకోవాలని నోటీసులు జారీ చేశారు. అనంతరం రోడ్డు మధ్య భాగంలో డివైడర్ నిర్మించి, లైటింగ్ ఏర్పాటు చేశారు. డివైడ్ నిర్మాణం పూర్తయిరా కూడా విస్తరణకు అడ్డుగా ఉన్న ఇండ్ల నిర్మాణాలు తొలగించుకోకపోవడంతో గత రెండు సంవత్సరాలుగా విస్తరణ పనులు ప్రారంభమైన, పనులు ముందుకు సాగడం లేదు. రహదారికి అడ్డుగా ఉన్న ఇండ్ల నిర్మాణాలను తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంతో ప్రధాన రహదారి ఇరుకుగా మారి భారీ గుంతల ఏర్పడ్డాయి. గుంతలు ఏర్పడడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. వర్షం నీరు వెళ్లేందుకు సరైన సదుపాయాలు లేకపోవడంతో రహదారి పై చేరి, వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అంతేకాకుండా ప్రస్తుతం ప్రధాన రహదారి వెంటవున్న నిర్మాణాలు కొందరు నిబంధనల విరుద్ధంగా ఇష్టానుసారంగా తొలగించారు. అధికారులు సూచించిన 80 ఫీట్లకు కాకుండా ఇంటి యజమానులు ఇష్టానుసారంగా నిర్మాణాలు తొలగించి, బాల్కనీల పేరుతో ఐదు సీట్లు ముందుకు జరిగి నిర్మాణాలు చేపట్టారు. అలా ఏర్పడిన నిర్మాణాలు కరెంట్ స్తంభాల విషయంలో అడ్డంకిగా మారాయి. నిర్మాణాలు తొలగించు సమయంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే అందుకు కారణమని అధికారుల తీరును పట్టణవాసులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. నిర్మాణాలు తొలగించుటలో పార్టీలకు అతీతంగా, తొలగించకుండా అధికారం లో ఉన్న వారికి ఒక రకంగా, సామాన్యులకు దగ్గర మరో రకంగా అధికారులు వ్యవహరిస్తున్నారని, నిబంధనల ప్రకారం నిర్మాణాలు తొలగించుకో కున్న అధికారులు వారికి సహకరిస్తూ, సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పూర్తిగా ఇండ్లు కోల్పోయిన వారు ఆరోపిస్తున్నారు. ఇలాంటి నిర్మాణాలు రోడ్డుకు ఇరువైపులా మురికి కాలువలు ఏర్పాటు చేస్తున్న సమయంలో అడ్డంకిగా మారే అవకాశం లేకపోలేదు. గత కొద్దిరోజులుగా విద్యుత్ అధికారులు రహదారికే అడ్డుగా ఉన్న స్తంభాలను తొలగించి, నూతన స్తంభాలను ఏర్పాటు చేశారు. స్తంభాలను ఏర్పాటులో, నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా ఏర్పాటు చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు ఆక్రమణలో ఉన్న ఇండ్లను నిబంధనల ప్రకారమే తొలగించారా

తరువాయి 4లో

# 15న మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ పిహెచ్‌డి ప్రవేశ పరీక్ష

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి :** మండలం పరిధిలో గల మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాలలో పిహెచ్‌డి ప్రవేశ పరీక్షను జూన్ 15న నిర్వహించనున్నట్లు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ఆచార్య ఆకుల రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరిలో వెలువరించిన నోటిఫికేషన్ అనుసరించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ హాల్ టికెట్లను విశ్వవిద్యాలయ వెబ్ సైట్ లో పొందవచ్చునని తెలిపారు. మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల కేంద్రంలో పరీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు.

# ఎంబిబిఎస్ విద్యార్థినికి జివిఎం ట్రస్టు సహాయం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ పట్టణానికి చెందిన కత్తుల అలివేలు హైదరాబాద్ మొయినాబాద్‌లోని భాస్కర్ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ తృతీయ సంవత్సరం చదువుతుంది. ట్యూషన్ ఫీజు చెల్లించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో గుత్తా వెంకట్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సౌజన్యంతో వరుసగా మూడో సంవత్సరం కూడా ఫీజు అందజేయడం జరిగింది. ఈ ఏడాది పాండ వేణు గోపాల్ యాదవ్ సహకారంతో ట్యూషన్ ఫీజు కోసం రూ.50 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గత ఫస్టియర్ ఫీజు కోసం అలివేలుకు రూ.50 వేలు ఆర్థిక సహాయం అందజేశామమని, గతేడాది రెండో సంవత్సరం టర్మ్ ఫీజు ఎన్నారై నూతల శ్రీకాంత్ రాజ్ సహకారంతో అలివేలుకు 50 వేలు అందజేశారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రతిభ కలిగిన నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకంలో భాగంగా నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 1 వ తరగతి, 5వ తరగతి ఎస్సి విద్యార్థిని, విద్యార్థులను బెస్ట్ అవైలబుల్ పథకం ద్వారా ఎంపిక చేశారు. మంగళవారం నల్లగొండ కలెక్టరేట్ లోని ఉదయాదిత్య భవన్ లో జిల్లా రెవిన్యూ అధికారి రాజ్య లక్ష్మి డ్రా తీసి బెస్ట్ అవైలబుల్ పథకానికి విద్యార్థిని విద్యార్థుల ఎంపిక ను ప్రారంభించారు. ఈ పథకానికి 134 మంది విద్యార్థిని విద్యార్థులను ఒకటవ తరగతి కి ఎంపిక చేయగా, మరొక 20 మంది విద్యార్థిని, విద్యార్థులను అధనంగా ఎంపిక చేశారు.అలాగే 137 మంది విద్యార్థిని విద్యార్థులను 5వ తరగతికి ఎంపిక చేశారు.5 వ తరగతిలో సైతం మరొక 20 మందిని అదనంగా ఎంపిక చేయడం జరిగింది. ఎవరైనా నిర్దిష్ట సమయంలో జాయిన్ కానీ ఎడల అదనంగా ఎంపిక చేసిన 20 మంది నుండి ఆ సీట్లని నింపుతారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజ్యలక్ష్మి తో పాటు, గిరిజన సంక్షేమ అధికారి రాజ్ కుమార్, బిసి సంక్షేమ అధికారి రమేష్, తదితరులు ఉన్నారు.



# ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని ఆర్‌డిఒకు వినతి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** అర్హులైన ప్రైవేట్ టీచర్లకు ఇందిరమ్మ ఇండ్లు, ఫణిగిరి గుట్ట వద్ద సింగిల్‌బెడ్‌రూం ఇండ్లు కేటాయించాలని కోరుతూ తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టె నాగరాజు యాదవ్ ప్రైవేట్ టీచర్లతో కలసి మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో శ్రీనివాసులకు వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా నాగరాజు యాదవ్ మాట్లాడుతూ గతంలో ఎన్నికల సందర్భంగా రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమారెడ్డిని కలసి ప్రైవేట్ టీచర్లలో 60 శాతం మందికి ఉండటానికి ఇండ్లు లేవని, చాలీచాలని వేతనాలతో జీవితం కొనసాగిస్తున్నారన్నారు. ప్రైవేట్ టీచర్ల సమస్యలను తెలియచేసి సింగిల్ బెడ్‌రూం ఇల్లు కేటాయించాలని కోరడం జరిగిందన్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెంటనే స్పందించి కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రైవేట్ టీచర్లకు న్యాయం చేస్తానని సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో ప్రైవేట్ టీచర్ల అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు మన్నెం నాగరాజు, పయ్యావుల ప్రకాష్, విజయ్‌కుమార్, భద్రంరాజు కవిత, లింగయ్య, నవీన్‌చారి, కోటేశ్వరరావు, హేమలత, రాహుల్, కల్పన పాల్గొన్నారు.

# కుల జనగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** దేశంలో, రాష్ట్రంలో గత పాలక ప్రభుత్వాలన్ని జనాభాలో సగభాగానికంటే ఎక్కువగా ఉన్న బిసి ప్రజలను మోసం చేస్తున్నారని, నేటికీ బిసి ప్రజలకు పార్లమెంట్లో, అసెంబ్లీలో రిజర్వేషన్లు లేకపోవడం స్థానిక సంస్థల్లో కూడా అతి తక్కువ రిజర్వేషన్లు ఇవ్వడం అత్యంత దుర్మార్గమని బిఎల్‌ఎఫ్ నాయకులు అభిప్రాయ పడ్డారు. కుల జనగణన చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రౌండ్ టేబుల్ సమావేశం మంగళవారం స్థానిక పెన్షనర్స్ భవనంలో నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు కామారెడ్డి డిక్లరేషన్‌లో 42 బిసి రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పడం కూడా హాస్యాస్పదం అన్నారు. 42 శాతం కంటే ఎక్కువగా గణనీయమైన సంఖ్యలో బిసి ప్రజలు ఉంటారని తక్షణం కుల జనగణన చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, యథాతథ పరిస్థితుల్లో ఎన్నికలు నిర్వహిస్తే మళ్లీ గత వివక్ష కొనసాగుతుందని, దీనిని సహించబోమన్నారు. ఈ సమావేశంలో బిఎల్‌ఎఫ్ రాష్ట్ర నాయకులైన బిసిపి రాష్ట్ర కార్యదర్శి కె. పర్వతాలు, బిఎల్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు, ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకట్ స్వామి, ఎం.సి.పి.ఐ.(యు) కేంద్ర కమిటీ సభ్యులు వస్కుల మట్టయ్య, రిటైర్డ్ ఐఎఎస్ చోల్లేటి ప్రభాకర్, రిటైర్డ్ తహసిల్దార్ ప్రకాష్, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్ గౌడ్, మునాస ప్రసన్న, లోకనబోయిన రమణ ముదిరాజ్, అల్లి వేణు కుమార్, తాడూరి రమేష్, నేలపట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బస్సు సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** ఆత్మకూర్(ఎస్) మండలంలోని అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని మంగళవారం తెలంగాణ ఆడ పిల్లల సమానత్వ సమైక్య బాలికల సభ్యులు జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావ్, డిపో మేనేజర్ శ్రీనివాసులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ జిల్లాలో పెద్ద మండలమైన ఆత్మకూర్ (ఎస్) మండల కేంద్రంతో పాటు ఏ గ్రామానికి బస్సు సౌకర్యం లేదన్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో చదువుకునే ఆడ పిల్లలు జిల్లా కేంద్రానికి వచ్చేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇంటర్, డిగ్రీ విద్యనభ్యసించే వారు బస్సు సౌకర్యం లేక చదువులకు దూరమవుతున్నారన్నారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్, డిపో మేనేజర్‌లు మండల కేంద్రంతో పాటు గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎం శ్రీజ, ఉపాధ్యక్షురాలు కుసుమశ్రీ, భవాని, మాధవి, అభిశ్రీ, శ్రావణి, మహేశ్వరి, అఖిల, సునామీ, లావణ్య, ఎంవి ఫౌండేషన్ బాధ్యులు వి లలిత, పాల్గొన్నారు.

# సొంత సిలబస్ విద్యా హక్కుల ఉల్లంఘనే

**ప్రజాపక్షం/దేవరకొండ :** ఏ దేశ విద్యా వ్యవస్థకైనా మూల స్తంభాలు ఒకటే సిలబస్ రెండు ఉపాధ్యాయులు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు తమ ఇష్టానుసారంగా సిలబస్ అమలు పరచడం విద్యా హక్కు చట్టం ఉల్లంఘన అవుతుందని ఏబివిపి రాష్ట్ర నాయకులు యలమల గోపిచంద్ మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సిఈఆర్‌టి(రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణా సంస్థ)రూపొందించిన సిలబస్ కాకుండా సొంత సిలబస్ వాడటం అనేది చట్టాన్ని అతిక్రమించటమే అవుతుందని ఇట్టి పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేట్ పాఠశాలలో ఎటువంటి అర్హతలు, ట్రైనింగ్ లేని టీచర్స్ చే బోధన చేయిస్తున్నారని ఆరోపించారు. సొంత సిలబస్ వాడటం విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలకు, జాతీయ బాలల హక్కుల సంరక్షణ సంఘం హెచ్చించిన విషయం కూడా గుర్తు చేశారు. ప్రభుత్వానికి అధికారులకు చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైనా జువైనైల్ జస్టిస్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# లక్కీ డ్రాతో విద్యార్థుల ఎంపిక

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** 2024–25 విద్యా సంవత్సరానికి 1వ,5వ తరగతుల్లో విద్యార్థుల ప్రవేశాలకు బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీంలో లక్కీ డ్రాతో విద్యార్థులను జిల్లా షెడ్యూల్ కులముల అభివృద్ధి అధికారులు మంగళవారం జిల్లా కేంద్రంలోని సూర్యాపేట ఫంక్షన్ హాల్‌లో లక్కీ డ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కె లత మాట్లాడుతూ1వ తరగతిలో ప్రవేశాల కోసం 94 మంది, 5వ తరగతిలో 98 మంది విద్యార్థులను డ్రా ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు 1వ తరగతి విద్యార్థులు ఈనెల 18న, 5వ తరగతి విద్యార్థులు 19వ తేదిన కలెక్టరేట్‌లోని జిల్లా షెడ్యూల్ కులముల అభివృద్ధి కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# దైవ చింతనతో మానసిక ప్రశాంతత



**ప్రజాపక్షం/చందంపేట:** దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని పిఏసిఎస్ చైర్మన్ జాల నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం చిత్రియాల గ్రామంలో వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి కళ్యాణంలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి సంవత్సరం జరుపుకునే పండుగ వెంకటేశ్వర స్వామి కళ్యాణం అని వానలు బాగా పడి పంటలు సంవృద్ధిగా పండాలని స్వామిని పూజిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి జాలే ప్రేమలతరెడ్డి, రాంరెడ్డి, లింగాల మధు, వెంకటయ్య, యాదయ్య, నిరంజన్, యాదయ్య, ధనమ్మ, మారయ్య, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నరకానికి దారిగా మారిన రోడ్లు

**ప్రజాపక్షం/గుండాల :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల వ్యాప్తంగా ఆయా గ్రామాలకు వెళ్ళే రహదారులు పూర్తిగా ద్వంసం అయి కంకర తేలి వాహనదారులకు నరకానికి దారిగా మారాయి. మండల వ్యాప్తంగా ఆయా గ్రామాలలకు వెళ్ళే రహదారులు పూర్తి ద్వంసం అయి వాహనదారులు ప్రయాణించాల్సిన పరిస్థితి లేదని దినితో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని గతంలో ఈ రోడ్లపై అనేక ప్రమాదాలు జరిగి ప్రజలకు తీవ్ర గాయాలు కావడం జరిందని అధికారులు నిర్లక్ష్యంతో రహదారులు గుంతల మయంగా మారి మృత్యు దారులుగా మారాయని అన్నారు. వానాకాలం మొదలైన తరుణంలో గుంతలు పడిన రోడ్డుల అలానే ఉంటే అవి పూర్తిగా ద్వంసం అయి ఎక్కడ గుంత ఉందో ఎక్కడ రోడ్డు ఉందో వాహనాదాలుకు అర్థం కాక ప్రమాదాలు ఎక్కువ సంబంవించే అవకాశం ఉందని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్లను మరమత్తులు చేసి ప్రయాణికులను కాపాడాలని కోరుతున్నారు.

# బాలల పౌష్టికాహార లోపం గుర్తింపు చర్యలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** శిశు, మహిళ సంక్షేమ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడి కేంద్రాల్లో బాలల్లో పౌష్టికాహార లోపం కనుగొనేందుకు ఆయా అంగన్‌వాడి కేంద్రాల్లో చర్యలు చేపట్టారు. వయస్సుకు తగ్గ బాలల ఎత్తు కొలిచి, బరువు ఉందా లేదా వెయింగ్ మిషన్ ద్వారా చూస్తున్నారు. పౌష్టికాహార లోపం ఉంటే వెంటనే బాలామృతం, బాలామృతం ప్లస్ ఇస్తున్నట్లు అంగన్‌వాడి టీచర్లు బి.పార్వతి, నాగమణి, అరుణ, మల్లీశ్వరిలు అన్నారు.

# పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి సన్మానం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పది జీపీఏ సాధించిన పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఇరుపురి అక్షరను వందేమాతరం ఫౌండేషన్ వారు సోమవారం హైద్రాబాద్‌లోని రవీంద్రభారతిలో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడివ్ద హాజరై అక్షరను, పాఠశాల ఉపాధ్యాయులను కృషి చేశారు. కార్యక్రమంలో ఎంఈవో బాలాజీనాయక్, ప్రధానోపాధ్యాయురాలు ఎన్.విజయకుమారి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సాయం అందజేత

**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రానికి చెందిన కోడూరు మల్లేష్ ఇటీవల అనారోగ్యంతో మరణించడం జరిగింది. నిరుపేద కుటుంబమైన మల్లేష్ కుటుంబానికి మంగళవారం 199899 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన మల్లేష్ మిత్రులు రూ. 15వేలను ఆర్థిక సాయంగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గౌలికార్ యుగంధర్, కోడపర్తి భాస్కర్, మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు సింగిల్‌విండో సర్వసభ్య సమావేశం

**ప్రజాపక్షం/ చౌటుప్పల్** : చౌటుప్పల్ సింగిల్ విండో సర్వసభ్య సమావేశం బుధవారం సింగిల్‌విండో కార్యాలయం ఆవరణలో ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో రైతులకు అందించాల్సిన ఎరువులు,విత్తనాలతో పాటు ఇతర సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కోన్నారు. సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

## దాడి చేసిన వారిని శిక్షించాలి



**ప్రజాపక్షం/చౌటుప్పల్** : సంస్థాన్ నారయణ పురం మండలం కేంద్రానికి చెందిన ఫోటో గ్రాఫర్ పులిమోని లింగస్వామి పై దాడి చేసిన వారిని శిక్షించాలని చౌటుప్పల్ ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. చౌటుప్పల్ బస్టాండ్ ఎదుట జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాయపడిన లింగస్వామి కి వైద్య చికిత్సలు అందించేందుకు ప్రభుత్వం సహకరించాలని అన్నారు. ఫోటో గ్రాఫర్స్ మీద దాడులకు పాల్పడితే సహించేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు తోర్పునూరి సాయిలు,ఫోటో గ్రాఫర్స్ మెట్టు రాంచంద్రారెడ్డి, విశ్వనాథ్ చంద్రశేఖర్, చింతల గణేష్, కాటంరాజు, వనం రుషి, రోషణగారి రాఘవేంద్ర, కత్తుల ప్రవీణ్, కందగట్ల కృష్ణ, శంకర్, రవి తదితరులు పాల్గోన్నారు.

## వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/బీబీనగర్** : మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన కావలి నరసింహ కుమారుడు కావలి ప్రవీణ్ ఇటీవల అనారోగ్యానికి గుర్రై డయాలసిస్ అవసరం నిమిత్తము మండల కేంద్రానికి చెందిన పింగళి అన్న సేవా వారి ఆధ్వర్యంలో రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని సేవాదళ్ అధ్యక్షులు ఎండి.మోహిన్ వారి కుటుంబాన్ని సందర్శించి సహాయం అందజేశారు. వారి వెంట గౌరవ అధ్యక్షులు కాసుల రఘునందన్ గౌడ్, పొట్ట నవీన్, నర్సిరెడ్డి, రవి, వెలగల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్ల అండర్ డ్రైనేజీ పనుల ప్రారంభం

**ప్రజాపక్షం/ఆలేరు** : ఆలేరు మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు శ్రీరామ్ నగర్ కాలనీలో జనరల్ ఫండ్ నుండి రూ.5 లక్షలు వేచించి సిసి రోడ్డు, అండర్ డ్రైనేజీ పనులను ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పర శంకరయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యత పరంగా లోపాలు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ డైరెక్టర్ వెంకటేష్, పార్టీ సీనియర్ నాయకులు శివమల్లు, ఉప్పలయ్య, రాజు, రఘు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు భరోసా...!

### దామన్న ప్రజా దర్బార్‌కు క్యూ



**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాగానే మాజీ మంత్రి, సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జీ రాంరెడ్డి దామోదర్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రవేశపెట్టిన ప్రజాదర్బార్ బాధితులకు ఎంతో భరోసా కల్పిస్తుంది. ఏళ్ళ తరబడి నుండి పరిష్కారానికి నోచుకోని ఎన్నో సమస్యలకు ఇక్కడ పరిష్కారం చూపుతున్నారు. దీంతో దామన్న ప్రజాదర్బార్‌కు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజాదరణ లభిచింది. ప్రజలు పెద్ద ఎత్తున తమ సమస్యలను చెప్పుకునేందుకు క్యూ కడుతున్నారు. బాధితుల బాదలను ఆలకించిన ఆయన అక్కడిక్కడే పరిష్కారం చూపుతున్నారు.

సూర్యాపేట నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నేనున్నానంటూ మాజీ మంత్రి, సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జీ రాంరెడ్డి దామోదర్ రెడ్డి తన నివాసంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో కొద్ది రోజుల పాటు ప్రజాదర్బార్ వాయిదాపడింది. ఎన్నికల కోడ్ ముగియడంతో తిరిగి ప్రారంభించారు. ప్రభుత్వం అధికారికంగా ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా దామన్న నిర్వహిస్తున్న దర్బార్‌కు బాధితులు బారులు తీరుతున్నారు. ప్రతి రోజు వందల సంఖ్యలో వచ్చి ఫిర్యాదులు చేస్తున్నారు. ఏళ్ళ తరబడి పరిష్కారం కాని తమ సమస్యలను ఆయనకు విన్నవించుకుంటున్నారు. ఇందులో ఎక్కువగా భూ వివాదాలు,కుటుంబ తగాదాలు, ఆర్థికమోసాలుతో పాటు వ్యక్తిగత సమస్యలను చెప్పుకుంటున్నారు. వీటితో పాటు ప్రభుత్వ కార్యాలయాలోకి వెళ్తే పనులు కాకపోవడం, అధికారుల పెట్టే ఇబ్బందులను పరిష్కరించాలని మోరపెట్టుకుంటున్నారు.

**సమస్యలు చెబితే చాలు.. అక్కడిక్కడే పరిష్కారం**

బాధితులు తమ సమస్యలు చెప్పిన వెంటనే దామన్న అక్కడిక్కడే వాటికి పరిష్కారం చూపుతున్నారు. వారు చెప్పే సమస్యలు ప్రభుత్వ పరంగా అయితే వెంటనే సంబంధిత అధికారులకు చరవాణిలో విషయాన్ని తెలియజేసి పరిష్కరించాలని కోరుతున్నారు. భూ వివాదాలకు సంబంధించి ఇరువర్గాలతో మాట్లాడి నష్టపోకుండా పరిష్కరించుకోవాలని సూచిస్తున్నారు. ఆర్థికమోసాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోని బాధితులకు న్యాయం చేయాలని పోలీస్ అధికారులను విన్నవిస్తున్నారు. వ్యక్తిగత సమస్యల పరిష్కారం కోసం స్థానికంగా ఉన్న ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులకు వివరించి సానుకూలంగా, శాంతియుతంగా పరిష్కరించి వారికి న్యాయం చేయాలని ఆదేశిస్తున్నారు. దీంతో ఏళ్ళ తరబడి నుండి పరిష్కారానికి నోచుకోని అనేక సమస్యలు ప్రజాదర్బార్‌లో పరిష్కారం అవుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## చేనేత పరిశ్రమను సంక్షోభం నుంచి రక్షించాలని వినతి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని నుంచి రక్షించేందుకు తక్షణ చర్యలు చేపట్టి చేనేత కార్మికులకు రోజువారీ పనిని కల్పించడం ద్వారా జీవనోపాధిని కాపాడాలని కోరుతూ మంగళవారం పోచంపల్లి చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో నాయకులు హైదరాబాద్‌లో ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రాన్ని సమర్పించారు. వినతి పత్రంలో తెలంగాణ రాష్ట్రంలో 35,000 పైగా మగ్గాలపై 1,10,000 మంది చేనేత కార్మికులు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ జీవనోపాధిని పొందుతున్నారు. సుమారు 315 ప్రాథమిక చేనేత సహకార సంఘాల ద్వారా 40 శాతం మంది మాత్రమే సహకార వ్యవస్థలో ఉపాధి పొందగలుగుతున్నారని పేర్కొన్నారు. మిగిలిన వారంతా మాస్టర్ వీవర్స్ పై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.పెరిగిన నూలు, శిల్క్ యారన్ ధరలతో పాటు రంగులు, రసాయనాల ధరలు పెరగడం రూ. 1000 పైబడిన వస్త్ర ఉత్పత్తులపై జిఎస్టీ పన్ను విధించడం వలన తయారైన వస్త్ర ఉత్పత్తుల అమ్మకాలకు మార్కెటింగ్ సౌకర్యం లేక వస్త్ర నిల్వలు పేరుకుపోయి పరిశ్రమ సంక్షోభంలోనికి నెట్టబడ్డదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినా చేనేతల వెతలు మాత్రం తీరడం లేదని దీనస్థితి వెళ్లబోసుకున్నారు.చేనేతల అభివృద్ధి, నిరంతర ఉపాధి కొరకు ఎంతో ఆశతో ఎదురుచూసినా తమ ప్రభుత్వంలో కూడా చాలీచాలని రోజువారి ఆదాయంతో కుటుంబ జీవనం చేయలేక దుర్భర దారిద్ర్య జీవితాలను గడుపుతున్న దుస్థితిని తమ దృష్టికి తెస్తూ పలు కీలక అంశాలను పేర్కొని తక్షణమే వాటిని అమలు చేయాలని కోరారు. ఏలి బిక్షపతి గంజి బసవలింగం కూరపాటి వెంకటేశం, గంజి కృష్ణ, వర్కాల వెంకటేశంలు అతి పత్రం సమర్పించిన వారిలో ముఖ్యులు.

# ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్య



**ప్రజాపక్షం/మోత్కూర్:** ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్య తోపాటు చదువుల్లో ప్రతిభ అందించే ప్రత్యేక ప్రోత్సాహకలను కూడా సద్వినియోగం చేసుకోవాలని మోత్కూర్ మున్సిపల్ చైర్మన్ గుర్రం కవిత లక్ష్మీ నర్సింహా రెడ్డి అన్నారు. మంగళవారం కళాశాల అధ్యాపకుల నిర్వహిస్తున్న ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో ఉచిత ప్రవేశం, పాఠ్యపుస్తకాలతో పాటు స్టడీ మెటీరియల్స్ అందించబడుతుందని అన్నారు. అంతే కాకుండా అనుభవం ఉన్న విద్యావంతుల అధ్యాపక బృందం మోత్కూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్నారని అన్నారు. వీరి సేవలను సద్వినియోగం చేసుకొని, భవిష్యత్తుకు బంగార బాటలు వేసుకోవాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రతిభ జస్టిస్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా కళాశాల విద్యార్థులు జిల్లా స్థాయి ర్యాంకులతో పాటు, కేంద్ర మానవ వనరుల శాఖ అందించే ఐదు సంవత్సరాల ఉపకార వేతనాలు విద్యార్థులు ఎంపికయ్యారని అన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇరువురు పథకానికి అర్హత సాధించారని వివరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకున్న విద్యార్థులకు మెడికల్, ఇంజనీరింగ్, అగ్రికల్చర్ కళాశాలలో ప్రవేశం పొందిన వారికి ప్రభుత్వ ఫీజులు రాయితీ కల్పించడంతో పాటు, ఉచిత సదుపాయాలను కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశించి, అందిస్తున్న ప్రోత్సాహకాల సద్వినియోగం చేసుకొని భవిష్యత్తుకు విద్యార్థులు బంగారు బాటలు వేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ లక్ష్మి నరసింహ రెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించాలి



**ప్రజాపక్షం/కోదాడః** ఈ నెల 12 నుండి పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను జాప్యం చేయకుండా వెంటనే అందించాలని మండల విద్యాధికారి సలీం హెచ్‌ఎంలను కోరారు.మంగళవారం పట్టణంలోని మండల వనరుల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలను మండలంలోని హెచ్ ఎంలకు ఆయన పంపిణీ చేశారు.విద్యార్థులకు సకాలంలో పాఠ్య పుస్తకాలు సరఫరా చేయడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.కార్యక్రమంలో హెచ్‌ఎంలు చలసాని శేఖర్,ఎల్‌డిపి ప్రమీల,సీఆర్పీలు శంకరాచారి,సుజాత,వెంకటరమణ,సురేష్, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ అనురాధ పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత



**ప్రజాపక్షం/మోతె:** మండలంలోని అన్నారిగూడెంలో పడిశాల సువార్త పూరిల్లు విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో దగ్ధకావడంతో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కీసర స ంతోష్ రెడ్డి మంగళవారం ఆమెకు రూ. 5వేల అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుండి సువార్తకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు మేదరమెట్ల వెంకటనారాయణ, నాయకులు గుడిపూడి వెంకటేశ్వరరావు, ఆదినారాయణ, సత్యం, సత్యనారాయణ, ముత్తయ్య, వీరమల్లు, అంజయ్య, నాగేశ్వర్ రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** భువనగిరిలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో మౌలిక వస్తువులైన మంచినీరు, కరెంటు, డ్రైనేజీ రోడ్లకు మరమ్మతులు చేసి లబ్ధిదారుల మైనటువంటి మాకు కేటాయించిన ఇండ్లలో మేము గృహప్రవేశాలు చేసుకొని అక్కడ నివాసం ఉండడానికి వీలు కల్పించాలని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డికి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నందు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు చేగురి సుధాకర్, కాచం శ్రీదేవి, కొత్త సత్యం, ఒరిగేశంకర్, ఎల్ సుమలత, కాలేఎవర్ శివశంకర్, భామిని మంజుల, శ్రీదేవి, రేవతి, తాడియా బద్రి, రచ్చ సాయి భాస్కర, అజర్, రోహిణి, రవి, ఉప్పలంచి శశిరేఖ, చింతకింది ఇంద్ర తదితరులు పాల్గొన్నారు

## ఫోటోగ్రాఫర్‌పై దాడికి నిరసన



**ప్రజాపక్షం/మోటకొండూరు:** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండల ఫోటోగ్రాఫర్ పులిమేని లింగస్వామిపై జరిగిన దాడిని తోటి ఫోటోగ్రాఫర్లు తీవ్రంగా ఖండించారు. మోటకొండూర్ మండల కేంద్రంలో మంగళవారం ఫోటో గ్రాఫర్స్ యునియన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫోటో గ్రాఫర్ పై దాడి చేసిన వారిని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు లోడే చంద్రశేఖర్ గౌడ్, ఉపాధ్యక్షులు తిరుమల్, ప్రధాన కార్యదర్శి మానెగల్ల విక్రమ్, అద్దమడుగు నాగరాజు, భూమండ్ల శివ కుమార్, బొజ్జ శంకర్, మానేగల్ల శశి తదితరులు ఉన్నారు.

# సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన శరత్

**ప్రజాపక్షం/బీబీనగర్ :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని బీబీనగర్ మండల రేవంత్ రెడ్డి సైన్యం మండల అధ్యక్షులు పొట్ట శరత్ మంగళవారం హైదరాబాద్ ముఖ్యమంత్రి కార్యాలయంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి పదవులు ఇస్తామని హామీ ఇచ్చారు.

# దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

**ప్రజాపక్షం/మోత్కూర్:** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండల ఫోటోగ్రాఫర్ పులిమేని లింగస్వామి పై జరిగిన దాడిని మంగళవారం మోత్కూర్ టోటల్ ఆఫర్లు తీవ్రంగా ఖండించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మంగళవారం మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్థలో మోత్కూర్ ఫోటో మరియు వీడియో గ్రాఫర్ల అధ్యక్షుడు చీమల వీరస్వామి ఆధ్వర్యంలో దాడిని నిరసిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గుండు శ్రీనివాస్, గుడిశాల రాజయ్య, కోమటి జనార్ధన్, వేణు, కూరెళ్ల విష్ణు, ఎడ్ల ప్రవీణ్, కూరెళ్ల రాజశేఖర్, తాండ్రల మహేష్, ప్రశాంత్, రాజశేఖర్, షాకీర్, శేఖరా చారి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు, సామాన్యులకు ఇబ్బంది లేకుండా బస్సులను పెంచాలి

**ప్రజాపక్షం/కోదాడః** మహిళలకు, సామాన్యులకు ఇబ్బంది లేకుండా బస్సులను పెంచాలని పిఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపోలో అన్ని గ్రామాలకు బస్సులు నడపాలని డిపో సూప రిండెంట్ కు వినతిపత్రం అందచేశారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి మహిళకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం ప్రతి ఒక్కరు హర్షించదగ్గ విషయ మన్నారు.కాగా ఉచిత ప్రయాణం వలన ప్రయాణికులు అధికంగా పెరిగి ఉన్న బస్సులు సరిపోక మహిళలు,సామాన్యులు అనేక ఇబ్బందులకు గురవుతున్నా రన్నారు. కొన్ని చోట్ల తెలిసి తెలియక గొడవలు పెట్టుకునే పరిస్థితి ఏర్పడ్డదన్నారు.ఈ విషయం సంబంధిత అధికారులు సిఎం దృష్టికి తీసుకెళ్లి యుద్ధ ప్రాతిపదికన పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటి బస్సులను పెంచాలని కోరారు.కార్యక్రమంలో లక్ష్మి , పావని, రేష్మ,సత్యమ్మ,మరియమ్మ,మాలాంబి, మల్లేశ్వరీ,నాగమణి పాల్గొన్నారు.

# ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్‌రూరల్‌:** మండలంలోని బూరుగడ్డ గ్రామంలో శ్రీఆదివరాహ లక్ష్మీ నరసింహా వేణుగోపాలస్వామి దేవాలయంలో వేంచేసియున్న క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామివారికి మంగళవారం ఆలయ అర్చకులు హరీష్‌కుమారచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో టి.వెంకటచలపతి, కోగంటి శ్రీరంగరామానుజన్,ములుగు సాయిచరణ్, కోదాటి వెంకట రమణారావు,బ్రహ్మం,వెంకటేశ్వర్లు, ధనలక్ష్మి, వెంటకనర్సమ్మ, ఆలయ సిబ్బంది గోవిందరెడ్డి, కిరణ్‌గౌడ్, రమేష్, ఉపేందర్,భక్తులు పాల్గొన్నారు.



# అవినీతి ఆరోపణల నుండి తప్పించుకునేందుకు సిబ్బందితో తప్పడు లేఖలు

## ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ అవినీతిపై డిసిహెచ్‌ఎస్ విచారణ



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ అలివేలుపై వచ్చిన అవినీతి ఆరోపణలపై ఆరోగ్య శాఖ రాష్ట్ర కమీషనర్ ఆదేశాల మేరకు నల్లగొండ డిసిహెచ్‌ఎస్ డాక్టర్ మాతృ మంగళవారం విచారణ చేశారు. ఆసుపత్రి సూపరిండెంట్ అలివేలు పై గత కొన్ని రోజులుగా అనేక ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో విచారణ చేపట్టడంతో ఆసుపత్రిలోని వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, హౌజ్‌కీపింగ్ సిబ్బంది విధులకు హాజరయ్యారు. అధికారులు విచారణకు వస్తున్నారని ముందస్తు సమాచారం వల్ల సిబ్బందితో పాటు ఆసుపత్రి ఆవరణ పరిశుభ్రంగా ఉండడంతో రోగులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం ఆసుపత్రికి వచ్చిన అధికారులు నర్సులను, డాక్టర్లను, హౌజ్ కీపింగ్ సిబ్బందిని వేరువేరుగా విచారించారు. అయితే గతంలో ఇక్కడ పని చేసిన డాక్టర్ సుధాకర్ మహిళ డాక్టర్ల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం వల్ల అతనిని విధుల నుండి తోలగించారు. దీన్ని మనస్సులో ఉంచుకోని ఈ ఆసుపత్రిలో పనిచేస్తున్న వారిపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారని డాక్టర్ అలివేలు వాపోతున్నారు. ఆసుపత్రి సూపరిండెంట్ ఆఫిస్‌లో డిసిహెచ్‌ఎస్ విచారణ చేస్తున్న సమయంలో బయట ఉన్న నర్సులు, హౌజ్ కీపింగ్ సిబ్బంది డాక్టర్ సుధాకర్‌పై కొన్ని ఆరోపణలు చేస్తు విచారణ అధికారికి రాతపూర్వకంగా అందజేశారు. డాక్టర్లు సైతం ఇదే పద్ధతిలో రాతపూర్వకంగా తమ అభిప్రాయాలను చెప్పారు. ఇన్నాళ్ళ నుండి ఎందుకు అధికారులకు విషయం చెప్పలేదని నిలదీసి అడగడంతో నర్సింగ్ సిబ్బంది,హౌజ్‌కీపింగ్ సిబ్బంది మౌనంగా ఉన్నారు. సూపరిండెంట్‌పై వస్తున్న అవినీతి ఆరోపణల నుండి తప్పించుకోవడానికి ఆసుపత్రిలోని సిబ్బందిని ఇలా పురమాయించి ఉంటారని ఆరోపణలు వస్తున్నాయి. చౌటుప్పల్ ఆసుపత్రిలోని డాక్టర్ల, సిబ్బంది పనితీరుపై ప్రజాప్రతినిధులు సైతం గుస్సాగా ఉన్నట్లు తెలుస్తుంది.

**విచారణ రిపోర్టును కమీషనర్‌కు పంపిస్తాం : నల్లగొండ డిసిహెచ్‌ఎస్ డాక్టర్ మాతృ**



చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ అలివేలు పై వచ్చిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ కమీషనర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టడం జరిగిందని నల్లగొండ డిసిహెచ్‌ఎస్ డాక్టర్ మాతృ తెలిపారు. విచారణ అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చిన రోగుల నుండి డబ్బులు వసులు చేస్తున్నట్లు, ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న డాక్టర్లు ప్రైవేట్ క్లినిక్‌లు నడుపుతున్నట్లు ప్రధానంగా ఆరోపణలు వచ్చాయని చెప్పారు. అన్ని విషయాలను,అన్ని కోణాల్లో విచారణ చేసినట్లు తెలిపారు. నివేదికను కమీషనర్ కు అందజేస్తామని అన్నారు. తదుపరి చర్యలు కమీషనర్ తీసుకుంటారని పేర్కోన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండలంలోని లచ్చమ్మ గూడం గ్రామంలో కస్తూరి ఫౌండేషన్ సహకారంతో 4.80 లక్షల వ్యయంతో నూతనంగా అంగన్వాడీ భవనాన్ నిర్మించి నేడు కస్తూరి శ్రీ చరణ్ చేతుల మీదగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కస్తూరి శ్రీ చరణ్ మాట్లాడుతూ 2017లో కస్తూరి ఫౌండేషన్ ప్రారంభించినపుడు విద్యారంగాన్ని సేవా రంగంగా ఎంచుకొని 7 సంవత్సరాల నుండి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. పేదరికంతో ఏ విద్యార్థి కూడా చదువుకు దూరం కావొద్దనే ఉద్దేశ్యంతోనే మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో మా ఫౌండేషన్ బాలికల విద్యపై,అంగన్ వాడి పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధా పెట్టమాన్నారు. చిన్నపిల్లలకు మంచి పౌష్టికాహారం అందాలని అంగన్వాడీ కేంద్రాలకు అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. కస్తూరి శ్రీ చరణ్ గారి చేతుల మీదగా అంగన్ వాడి పిల్లలకు ఆట వస్తువులు,గ్యాస్ స్టవ్,పప్పు కుక్కరు,బాలింతలు అంగన్ వాడి కేంద్రానికి వచ్చినపుడు వాళ్లకు ఇబ్బందులు కలగకుండా చైర్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జె.అలివేలు, అంగన్వాడీ సూపర్ వైజర్ శ్రీలత, అంగన్వాడీ టీచర్ అలుగువెల్లి నిరూప, ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు సాగర్ల లింగయ్య, జె.జగన్, జక్కలి రాజు, ముత్తయ్య, జక్కలి విక్రమ్, కస్తూరి ఫౌండేషన్ సభ్యులు బోనగిరి దేవేందర్, మహేష్, నవీన్ రెడ్డి, రామకృష్ణ, నరేందర్ రెడ్డి, జహంగీర్, వీరమల్ల కార్తీక్ గౌడ్, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సాయం అందజేత

**ప్రజాపక్షం/మోత్కూరు :** మున్సిపాలిటీ గడిబజార్‌కు చెందిన నిలిగొండ రేణుక అనారోగ్యంతో బాధపడుతూ, వైద్య ఖర్చుల కోసం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటుంది. విషయం తెలుసుకున్న యువరాజ్ యూత్ సభ్యులు సేకరించిన రూ.11,000 మంగళవారం రేణుక తల్లిదండ్రులకు అందజేశారు. భవిష్యత్తులో కూడా తమ వంతు సహకారం వుంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు జంగ నర్సయ్య, ఉపాధ్యక్షుడు కాశమేనీ మహేందర్, యూత్ ప్రతినిధులు పురుగుల రమేష్, కోమటి మత్స్యగిరి, జంగ సతీష్ పాల్గొన్నారు.



# తండ్రికి తలకొరివి పెట్టిన తనయురాలు



**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని బోగారం గ్రామానికి చెందిన ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ కార్యకర్త కూనూరు సుదర్శన్ గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. సుదర్శన్‌కు కుమారులు లేకపోవడంతో కుమార్తె భాగ్య తండ్రికి తలకొరివి పెట్టడంతో పలువురు కంటతడి పెట్టారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ అంతటి పద్మరమేష్‌గౌడ్ రూ.10వేలను, బీజేపీ గ్రామశాఖ నాయకులు రూ.10వేలను, కాంగ్రెస్ నాయకులు కూనూరు సాయికుమార్‌గౌడ్ రూ.10వేలను, గోశిక వెంకటేశ్వర్లు రూ.5వేలను, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు రూ.5వేల ఆర్థిక సహాయం అందచేశారు. సుదర్శన్ గ్రామంలో అందరితో కలివిడిగా ఉండేవాడని స్థానికులు కంటతడి పెట్టారు. సుదర్శన్ మరణంతో గ్రామంలో విషాఛాయలు అలుముకున్నాయి. సింగిల్‌విండో డైరెక్టర్, బీజేపీ నాయకుడు కన్నెకంటి వెంకటేశ్వరచారి సుదర్శన్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందచేశారు. ఆయన వెంట నాయకులు కొమ్ము యాదయ్య, సిందం లింగయ్య, కొడాలి వెంకటేష్, కర్నాటి నరేష్, రాపోలు రమేష్, రచ్చ ఆనంద్, మధ్యపురి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలను అమ్ముతూ,అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని చౌటుప్పల్ ఆర్డీఓ కు మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు పల్లె శివకుమార్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల నియంత్రణ చేయాలని అన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. పాఠశాలలో పాఠ్యపుస్తకాలు,యూనిఫాంలు విక్రయించరాదని చెప్పిన కూడ చౌటుప్పల్ లోని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తోక్కుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ప్రైవేట్ పాఠశాలల ఆగడాలని అరికట్టాలని కోరారు. ఈ వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ అధ్యక్షులు దాసరి ప్రకాష్, మండల నాయకులు దోనూరి శ్రవణ్, నరేష్, ఆజెందర్ తదితరులు ఉన్నారు.

# బోరు, నీళ్ల ట్యాంకును కూల్చిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/మోత్కూర్ :** మోత్కూరు మున్సిపాలిటీ 11 వార్డు అన్నెపువడా గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ భూమిలో ఉన్నటువంటి బోర్, నీళ్ల ట్యాంక్‌ను ఎలాంటి అనుమతి లేకుండా ఇంటి నిర్మాణంలో భాగంగా అడ్డుగా వుందని కూల్చివేసిన వ్యక్తి పై చర్యలు తీసుకోవాలని మంగళవారం కాలనివాసులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు అన్నెపు నర్సింహ, అన్నెపు యాకు, అన్నెపు సతీష్, అన్నెపు బాలస్వామి, అండాలు, పద్మ, అగమ్మ, మంజుల, బోయిని జయమ్మ, మంగ తదితరులు ఉన్నారు.

# విస్తరణ అస్తవ్యస్తం

(మొదటి పేజీ తరువాయి)

లేదా అని పర్యవేక్షించాలని, నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలను తొలగించి, రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**పార్టీలకతీతంగా అడ్డుగా నిర్మాణాలు తొలగించాలి : కొణతం యాకుబ్ రెడ్డి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్**



మోత్కూరు మున్సిపాలిటీలో రోడ్డు విస్తరణ పనులు అస్తవ్యస్తంగా నడుస్తున్నాయి. పార్టీలకతీతంగా అడ్డుగా నిర్మాణాలను తొలగించాలి. అధికార పార్టీలో ఉన్నవారికి మినహాయింపు ఇవ్వడం సరి కాదు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు విషయంలో అధికారులు కూడా తారతమ్యాలు ప్రదర్శించారు. ప్రభుత్వం నిర్ణయించిన కొలతలు ప్రకారమే ఇండ్ల తొలగింపు చేపట్టాలి. అధికారులు దగ్గరగా ఉండి పర్యవేక్షించాలి. త్వరగా పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి.

**చర్యలు తీసుకుంటాం : మున్సిపల్ కమిషనర్ సి శ్రీకాంత్**



నిర్మాణాలను పర్యవేక్షిస్తాం. నిబంధన ప్రకారం ఇంటి నిర్మాణాలను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాము. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు. కరెంటు స్తంభాలు ఏర్పాటు విషయంలో దగ్గర ఉండి పర్యవేక్షిస్తాము. అవకతవకలు జరిగినట్లయితే వెంటనే సరి చేస్తాము. ప్రస్తుతం నిర్మిస్తున్న మురికి కాలువ కేవలం హాస్టల్ దగ్గర నుండి వస్తున్న మురుగు నిరు చెరువులకు వెళ్లేందుకు మాత్రమే నిర్మాణం చేపడుతున్నారు. త్వరలోనే కొత్త టెండర్లు పిలిచి, రహదారి పనులు పూర్తి చేయిస్తాం.